# ప్రేముత్తరం

కోలపల్లి ఈశ్వర్

"ఏంట్రా అది?" అడిగాడు అన్నారావ్.

"ఉత్తరం" చెప్పాడు చిన్నారావ్.

"ఎవరికి?"

"మన ఎదురింట్లో వసంతకి!"

"వ్వాట్! వసంతకా?" నిర్ఘాంతపోతూ అడిగాడు అన్నారావ్.

"వసంతకి నువ్ ఉత్తరం రాయడం ఏంటి? ఏముత్తరమది?"

"ప్రేముత్తరం!" రాయడం కొనసాగిస్తూనే చెప్పాడు- తల ఎత్తకుండా చిన్నారావ్.

అంతే..."చిన్నా!" అని బిగ్గరగా అరిచి జుట్టు పీక్కున్నాడు అన్నారావ్.

"ఎందుకలా ఏనుగులా ఘీంకరించావ్? ఏమైంది?" కలాన్ని కాగితం మీద పరుగులు తీయిస్తూనే ప్రశ్నించాడు చిన్నారావ్.

"ఏమైందని అడుగుతున్నావా? ఛ... మిత్రద్రోహి" అన్నాడు ఏహ్యంగా అన్నారావ్.

"ఇందులో మిత్రద్రోహం ఏముంది?"

"కాక? వసంతని నేనెంత గాఢంగా ప్రేమిస్తున్నానో తెలిసుండి కూడా నువ్ తనకి ప్రేముత్తరం రాయడమేంటి?" కంఠంలో ఆవేదన సుళ్లు తిరుగుతుండగా ప్రశ్నించాడు అన్నారావ్.

"నువ్ తనని గాఢంగా ప్రేమిస్తున్నావ్ సరే- కానీ, నీ ప్రేమని తనకెప్పుడూ తెలియజేయలేదుగా!"

"అందుకని నువ్ ప్రేముత్తరం రాసేస్తావా? హు..ఇదేనా స్నేహమంటే?" అన్నారావ్ అక్కినేని నాగేశ్వరరావు స్టయిల్లో అనబోయి, మరీ అంత ఓల్డ్‌గా ఎందుకులెమ్మని నాగార్జున స్టయిల్లో అన్నాడు.

"నాకు ధైర్యం లేక ఆమెకు నా ప్రేమను తెలియజేయలేకపోతున్నానే అనుకో...అందుకని ఆ ఛాన్స్ నువ్ కొట్టేయాలని చూస్తావా?"

"మరదే ఆవేశపడిపోవడం అంటే! నీ ప్రాణ స్నేహితుడ్ని కాబట్టే, స్నేహం విలువ తెలసిని వాడ్ని కాబట్టే-ఆమెకు ప్రేముత్తరం రాస్తున్నా" నా దోషం లేశమైనను లేదన్నట్టుగా చూస్తూ- రాతనింకా కొనసాగిస్తూనే అన్నాడు చిన్నారావ్.

"అంటే-నా తరపున నువ్ రాస్తున్నావా?" ఈసారి ఆనందంగా అడిగాడు అన్నారావ్.

"నీ బొంద! అలా నీ తరపున నేనూ రాస్తే ఆమె నిన్ను ఒక పిరికి వెధవనుకుంటుంది. నన్నేమో..ఎందుకులే..అంతమాట నా నోట చెప్పడం?" రాయడం ముగించి పెన్నుకి కేప్ పెట్టేస్తూ అన్నాడు చిన్నారావ్.

"మరయితే ఏంటీ మతలబు?"

"నా తరపున నేనే రాసుకుంటున్నాను. కాదు కాదు..రాసేశాను" చిన్నారావ్ చిరునవ్వుని చూస్తుంటే అతన్ని పచ్చడి పచ్చడిగా తన్నాలనిపించింది అన్నారావ్‌కి.

"నీ తరఫున నువ్వే రాస్కుంటే అది స్వార్థం అవ్వుద్ది...అంతేగానీ స్నేహం విలువ తెలిసినట్టేలా అవ్వుద్ది?" అన్నాడు కోపంగా.

"నేను రివర్స్ పద్ధతిలో వెళుతున్నాను. ఫలితం కోసం వేచి చూడు.." అన్నాడు చిన్నారావ్ రాసేసిన ఉత్తరాన్ని ఓ కవరులో పెట్టి అంటిస్తూ.

"ఏంటెదురుచూసేది నీ మొహం? ఛీ..నువ్వింత దగాకోరువనుకోలేదు" అనేసి, అక్కడ్నుంచి విసురుగా వెళ్లిపోయాడు అన్నారావ్.

అలా వెళ్లిపోయిన అన్నారావ్ అదే గదిలో ఓ మూలన కూర్చొని.."ఇంతేరా ఈ స్నేహమూ..స్వార్థమేరా దీనికి అంతమూ" అనే ఓ సొంత పాటని 'ముస్తఫా..ముస్తఫా' అనే పాపులర్ సాంగ్‌ట్యూన్లో పాడుకుంటూ ఉండగా-

చిన్నారావ్ వరండా మీద ఆడుకుంటున్న హౌస్ ఓనర్‌గారి మూడో మనవడ్ని చేరబిలిచి, వాడి జేబులో ఓ టెన్ కుక్కి (చూపించి మరీ) వాడి ద్వారా తను రాసిన ఉత్తరాన్ని, ఎదురింటి అడ్వకేట్ ఏకాంబరంగారమ్మాయి వసంతకి పంపించేశాడు.

పాట పాడుకుంటూనే అదంతా చూస్తున్న అన్నారావ్ 'ఛీ! జీవితంలో ఇంక వీడి మొహం చూడకూడదు. తక్షణమే వేరే రూమ్ ఏదైనా చూస్కుని వెళ్లిపోవాలి. వీడికి వీడి బోడి స్నేహానికీ తిలోదకాలిచ్చేయాలి' అనుకున్నాడు యమ సీరియస్‌గా! అలా అనుకుంటున్నప్పుడు అతని పళ్లు అతని ప్రేమయం లేకుండా పటపట పట మనే శబ్దాన్ని ఉత్పన్నం చేశాయ్!

సదరు పట పట పట శబ్ద జనకస్థానం తన మిత్రుడి నోరేనని గ్రహించిన చిన్నారావ్ "ఏంట్రా పళ్లు కొరుకుతున్నావ్?" అనడిగాడు సింపుల్‌గా! అంటే తానతగాడికి ఏ ద్రోహమూ చేయనట్టుగా అన్నమాట.

దానికి అన్నారావ్ సహజంగానే మండిపడ్డాడు "ఛఫ్..నోర్మూయ్ వెధవా! నాకింత ద్రోహం చేసింది చాలక-సిగ్గులేకుండా ఇంకా నాతో మాట్లాడుతున్నావా పైగా? నేన్నినీ జీవితంలో క్షమించను! సాధ్యమైనంత త్వరలో రూమ్ ఖాళీ చేసి వెళ్లిపోతాను..ఆ.." అన్నాడు పిడికిళ్లు బిగిస్తూ.

"ద్రోహం కాదురా తండ్రీ! రివర్స్ పద్ధతి..అదంతే! రెండు మూడు రోజులాగు..ఫలితం నీకే బోధపడుతుంది. నేనెంత గొప్ప మిత్రుడ్నో నీకు తెలుస్తుందప్పుడు" చెదరని చిరునవ్వుతో అన్నాడు చిన్నారావ్.

"ఏంటి తెలిసేది? నీ కుళ్లు మనసు నాకిప్పటికే అంతా తెలిసిపోయింది. నేనేం చెవిలో పువ్వెట్టుకోలేదు. నువ్ చెప్పే మాటలు నమ్మటానికి" అనేసి ఈసారి ఏకంగా గదిలోంచే బయటికెళ్లిపోయాడు అన్నారావ్ కోపంగా.

"పోతేపోరా..నా స్నేహం విలువ తెలిశాక నువ్వే వస్తావ్ లేరా.." అనే పాటని (రచన-కందల చిన్నారావ్, సంగీతం, కందల చిన్నారావ్) 'కుడి ఎడమైతే పొరపాటు లేదోయ్-' అనే ఇమ్మోర్టల్ సాంగ్ ట్యూన్లో పాడుతూ గదిలోనే కూర్చున్నాడు చిద్విలాసంగా చిన్నారావ్.

* * *

"ఏంట్రా ఇది?" అడిగింది వసంత- ఆ బుడతడిచ్చిన కవర్ని అందుకుంటూ.

"ఏమో చిన్నారావంకులిచ్చాడు" అనేసి తూనీగలా వెళ్లిపోయాడా బుడతడు.

ఒక పిల్లవాడి ద్వారా ఒక యువకుడు పంపించేది ఇంకేంముంటుందీ, ఖచ్చితంగా ప్రేముత్తరమే అయ్యుంటుంది. అనుకుంటూ ఆ కవర్ని ఓపెన్ చేసి, అందులోంచి ఓ గులాబిరంగు కాగితాన్ని బైటకు లాగింది వసంత.

"నా ప్రాణేశ్వరి వసంతగార్కి.."

సంబోధన చూడ్డంతోనే అది ప్రేముత్తరమని అర్థమైపోవడంతో, నా ఊహ కరక్టేనని, అలా కరక్ట్‌గా ఊహించగలిగినందుకు తన టాలెంట్‌కి కాస్త సంతోషం లాంటిది పడి-దరిమిలా తన చూపుని మిగతా అక్షరాల మీదకు ప్రసరింపజేసింది వసంత-ఇంట్రెస్ట్‌గా.

"నా పేరు చిన్నారావ్. మీ ఎదురింట్లో ఉంటున్న ఇద్దరు బ్రహ్మచారుల్లో ఒకడ్ని. మీరు మా ఎదురింట్లో అద్దెకు దిగినప్పట్నుంచీ నేను మిమ్మల్ని ప్రేమిస్తూనే వున్నాను. అలాగే నా రూమ్మేట్ కమ్ ఫ్రెండ్ అయినట్టి అన్నారావ్ కూడా మిమ్మల్ని ప్రేమిస్తూనే ఉన్నాడు. అయితే వాడొట్టి చవట. ఆడవాళ్లంటే అపరిమితమైన గౌరవం వాడికి. స్త్రీలు దేవతలతో సమానం అంటుంటాడు. అంచేత ఎలాడెలాగూ సాహసించి మీకిలాంటి ప్రేముత్తరం రాయలేడు కాబట్టి నేనిలా 'ఎర్లీ బర్డ్?' అవుతున్నాను.

ఒకవేళ నా అంచనా తప్పయి నాకు తెలియకుండా వాడీసరికే మీకు ప్రేముత్తరం గనక రాసేసుంటే, వాడ్ని గురించి మీకు కొన్ని కఠిన సత్యాలు చెప్పాలి. ఏమనుకోకండి..వాడికి చాలా ఆస్తి ఉంది. అయితేనేం? జీవితాన్ని అనుభవించటం చేతకాని వెధవ వాడు. ఉత్త పప్పు సుద్ద. ఒక సిగరెట్ కాల్చడు. ఒక బీడీ తాగడు. కనీసం వక్కపొడి కూడా తినడు. చెబితే నమ్మరుగానీ, ఆ రోత వెధవ కాఫీ, టీలు కూడా అంటుకోడు. ఈరోజుల్లో వాడెలా పుట్టాడో నాకైతే అర్థం కాదు. అలాంటి వాడ్ని చేసుకుని ఏ ఆడది మాత్రం సుఖపడుతుంది చెప్పండి? అందుకే-నన్ను ప్రేమించినా, ప్రేమించకపోయినా వాడిని మాత్రం ప్రేమించొద్దని మిమ్మల్ని హెచ్చరిస్తున్నాను.

అంతే కాదండోయ్! స్త్రీల విషయంలో వాడొక దద్దమ్మ! ఇంతవరకూ ఏ స్త్రీ వంకా కన్నెత్తి చూసిన పాపాన కూడా పోలేదు వెధవ! బొత్తిగా పెళ్లికి ముందే సరసం వద్దనే మనిషి! అలాంటివాడితో జీవితం మీరే ఊహించండి. ఇదంతా ఎందుకు రాస్తున్నానంటే నేను మిమ్మల్ని మనసారా ప్రేమిస్తున్నాను గనుక! ఒకవేళ మీరు నా ప్రేమని అంగీకరించకపోయినా ఇవన్నీ తెలిశాక వాడి ప్రేమనీ అంగీకరించకుండా ఉంటారు గనక.

నా ప్రేమ విషయంలో మీ అభిప్రాయాన్ని సాధ్యమైనంత త్వరలో తెలియజేస్తారని ఆశిస్తూ-

మరొక మాటండోయ్. పెళ్లయ్యాక తన జీతం, తన ఆస్తిపాస్తులు, భార్యకప్పగించి పెత్తనమంతా ఆమెనే చూసుకోమంటాడట. మీరైనా చెప్పండి. మగవాడేనా వాడసలు? ఛ..ఉంటానండీ..మీ..ప్రేమకాంక్షి..

-కందల చిన్నారావ్".

సహజంగానే ఆ ఉత్తరం చదవగానే ఆమెకు ఆ కందల చిన్నారావ్ మీద ఏవగింపు కలిగింది.



★ ★ ★

"కందల చిన్నారావ్‌గారికి..

మీ ఉత్తరం చూశాక- మీ ఫ్రెండ్ కమ్ రూమ్మేట్ అయిన శ్రీ అన్నారావ్‌గారు ఎంత యోగ్యులో నాకు అర్థమైంది. ఎట్ ది సేమ్ టైమ్..మీదెంత కపట హృదయమో కూడా తెలిసిపోయింది. ఎదురింట్లో ఇద్దరు బ్రహ్మచారులుంటున్నారని తెలుసునే తప్ప మీ పేర్లేంటో నాకింతవరకూ తెలీదు. ఇద్దరూ బ్యాంక్ ఎంప్లాయీస్ అని మాత్రం తెలుసు. ఇప్పుడు మీ ఉత్తరం చూశాక కూడా మీ ఇద్దరి పేర్లూ అన్నారావ్-చిన్నారావ్ అని తెలిసిందే తప్ప-మీలో ఎవరు అన్నారావ్? ఎవరు చిన్నారావ్? నాకు తెలియలేదు. అయినప్పటికీ మీ ఉత్తరాన్ని బట్టి మీలో అన్నారావ్ అనే వ్యక్తి యోగ్యుడని తెలుసుకుని ఈ క్షణం నుండి అతన్ని ప్రేమిస్తున్నాను నేను.

దమ్ముంటే ఈ ఉత్తరం అన్నారావ్‌కివ్వండి. లేదా మీలో అన్నారావ్ ఎవరో నేనే తెలుసుకుని అతనికి ప్రత్యేకంగా ఉత్తరం రాస్తాను.

ఇట్లు మీ ఎదురింటి వసంత."

ఉత్తరం చదవటం ముగించి...'గ్రాండ్ సక్సెస్' అని బిగ్గరగా అరిచి, దాన్ని అన్నారావ్‌కి అందించాడు చిన్నారావ్.

ఆ ఉత్తరాన్ని చదువుకుని ఆనందభరితుడైన అన్నారావ్ "అసలేం రాశావ్‌రా?" అని అడగ్గా..అప్పుడు చెప్పాడు చిన్నారావ్. తానేం రాసిందీ..ఎందుకు రాసిందీ అన్న సంగతులు.

అంతే! ఆ మరుక్షణం అన్నారావ్ చిన్నారావ్‌ని గట్టిగా కౌగలించేసుకుని.."స్నేహమేరా జీవితం- స్నేహమేరా శాశ్వతం" అనే సొంతం కాని పాటని అదే ట్యూన్‌లా పాడుకోవడం ప్రారంభించాడు ఆనందంగా!

☆